క్లుప్తంగా

విద్యార్థికి నగదు పురస్కారం



మంత్రి ప్రభాకర్, కలెక్టర్ హైమావతి నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రణీత్ రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో 963 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థి ప్రణీత్‌రెడ్డికి రూ.10 వేల నగదు పురస్కారం పొందినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా సిద్దిపేట సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా తమ విద్యార్థి నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణీత్‌రెడ్డిని అభినందించారు.

పెద్దమ్మ తల్లికి పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

చిన్నకోడూరు(సిద్దిపేట): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని చిన్నకోడూరులోని పెద్దమ్మ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే కుంకుమపూజలు, వ్రతాలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి దయతో పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యాంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

రోడ్డంతా జలమయం



రంగనాయకసాగర్ కట్ట రోడ్డుపై నిలిచిన నీరు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ కట్టపై వేసిన బీటీ రోడ్డు జలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే కట్టపై రోడ్డంతా నీరు నిలిచిపోతోందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రిజర్వాయర్‌ను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందిగా మారింది.

టై, బెల్టు, ఐడీ కార్డుల అందజేత



విద్యార్థులతో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని వట్టిపల్లి బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.70 వేలు విలువలగల టై, బెల్టులు, ఐడీ కార్డులతోపాటు ప్రాథమిక పాఠశాలలో బెంచీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సరోజ, శ్రీనివాస్, నాయకులు రాములు, ఎల్లయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఇబ్బందులు



బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మిరుదొడ్డి(దుబ్బాక): నెల రోజులుగా తాగునీటి కోసం తంటాలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండల పరిధిలోని మల్లుపల్లి మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో తాగునీరు గగనంగా మారుతోందంటూ శుక్రవారం వారు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నెల రోజుల నుంచి తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. నీటి కోసం వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసి విన్నవించినా అధికారులకు సోయి లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



స్వాతంత్ర్య వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్, వైస్ చైర్మన్ తదితరులు



క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న హరీశ్‌రావు



చేర్యాల(సిద్దిపేట): జెండా వందనం చేస్తున్న కమిషనర్ నాగేందర్ తదితరులు

మురిసిన మువ్వన్నెల జెండా

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

జిల్లా వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలంతా ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ పతాకాన్ని ఉత్సాహంగా ఆవిష్కరించారు. అధికారులు, నాయకులు మువ్వన్నెల జెండాకు వందనం సమర్పించి స్వతంత్ర సంగ్రామంలో కీలకపాత్ర పోషించిన సమరయోధుల త్యాగాలను కొనియాడారు.



గజ్వేల్ కోర్టు ఆవరణలో జడ్జి స్వాతిగౌడ్ జెండా వందనం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శంకర్



వర్గల్‌లో తహశీల్దార్ బాల్‌రాజు జెండా వందనం



హుస్నాబాద్: కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఎగరవేస్తున్న జడ్జి రేవతి



కొమురవెల్లి(సిద్దిపేట): జెండా ఆవిష్కరిస్తున్న ఈఓ అన్నపూర్ణ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నర్సిరెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



చిన్నకోడూరులో వివిధ వేషధారణలతో విద్యార్థులు



మిరుదొడ్డి(దుబ్బాక): ప్రాథమిక పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థులు



సంప్రదాయ నృత్యం చేస్తున్న మిరుదొడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



దుబ్బాకలో గాంధీ విగ్రహం వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సరిపడా యూరియా సరఫరా చేయాలి

బారులు తీరిన రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అవసరానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద యూరియా కోసం శుక్రవారం అన్నదాతలు బారులు తీరారు. క్యూలైన్‌లో పట్టాపాస్ బుక్‌లు ఉంచి గంటల తరబడి నిలబడుతున్నారు. కొందరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయగా, మిగిలిన వారు నిరాశ చెంది వెళ్లిపోయారు.

యూరియా కొరత తీర్చాలి

హుస్నాబాద్: యూరియా కొరతను ప్రభుత్వం వెంటనే తీర్చాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి వెంకన్న, రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అన్వర్ పాష తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట సహకార సంఘం ఎదుట బారులు తీరిన రైతులు

నేడు బీఆర్‌ఎస్ ధర్నా

గజ్వేల్: యూరియా కొరతపై శనివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద రాజీవ్‌రహదారిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గజ్వేల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో యూరియా కొరత తలెత్తలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటశాల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పునాది కందకంలో దిగి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలలు కావస్తున్నా కందకాలకే పరిమితమైందని వాపోయారు. మధ్యాహ్న భోజనాన్ని చెట్ల కింద వండుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు రాజమల్లు, శ్రీకాంత్, పరశురాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని అరెస్టు చేయాలి



సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాలు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్, దళిత మహిళ, ప్రజా సంఘాల నేతల డిమాండ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్‌పై దాడి చేసిన డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ల యేసు, నరహరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడానికి వచ్చి తిరిగి వెళ్తున్న నర్సారెడ్డి వాహనాన్ని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్, దళిత మహిళ, ప్రజా సంఘాల నాయకులు అడ్డుకునేందుకు యత్నించారు. అనంతరం విజయకుమార్‌కు మద్దతుగా సిద్దిపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో నర్సారెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. స్థానిక బస్‌స్టాండ్‌లో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నర్సారెడ్డిని వెంటనే అరెస్టు చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్లు రాజేశ్, ప్రసాద్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భాను, లక్ష్మి, కనకవ్వ, మమత, సంధ్య, అంజలి, యాదవ్వ, ప్రమీల, బాలవ్వ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో సత్తా చాటుతాం

టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు

గజ్వేల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకుంటామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధితో ముందుకుసాగుతున్నారని చెప్పారు. రైతు రుణ మాఫీ, మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా పెంపు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సి బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందని సూచించారు. సమావేశంలో గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

వెయ్యి మంది పోలీస్‌లతో సమానం

సీఐ శ్రీనివాస్

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వెయ్యి మంది పోలీస్‌లతో సమానమన్నారు. వాటితో దొంగతనాలను అరికట్టవచ్చని చెప్పారు. అనుమానిత వ్యక్తులు కనిపించినా, గ్రామ శివార్లలో పేకాట ఆడినా తమకు సమాచారం అందించాలని కోరారు. వాలీబాల్ క్రీడా కారులకు వెన్నెల మల్లారెడ్డి, విజయలక్ష్మి దంపతులు క్రీడా దుస్తులు అందజేశారు. అనంతరం వాలీబాల్ పోటీలను సీఐ ప్రారంభించారు. ఎస్‌ఐ కీర్తి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్, రాజిరెడ్డి, రాంచంద్రం, నాగరాజు, ప్రభాకర్, రాంజీ పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, వారు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. ప్రజ్ఞాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, గంజాయి, డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎంచుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా 100 లేదా సిద్దిపేట షీటీమ్(8712667434)కు సమాచారం అందించాలని సూచించారు. ఎంఈఓ కృష్ణ, హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండ్ల ఊరేగింపు



చేర్యాలలో బండ్ల ఊరేగింపు సందడి

చేర్యాల(సిద్దిపేట): ప్రతియేటా శ్రావణమాసం చివరి వారంలో నిర్వహించే బండ్ల ఊరేగింపు, బోనాల కార్యక్రమం చేర్యాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం అన్ని కులాల వారు ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలు ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాలతో ముగుస్తుంది. మొదటి రోజైన శుక్రవారం సాయంత్రం మహిళలు మహంకాళీ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



సరిఫికెట్లు అందుకున్న మహిళలు

శిక్షణ మహిళలకు సర్టిఫికెట్లు

సిద్దిపేటజోన్: శిక్షణ పొందిన మహిళలు ఉపాధి పొంది రాణించాలని సత్యసాయిబాబా సేవా సంస్థల జిల్లా మహిళా కో-ఆర్డినేటర్ యమునారాణి సూచించారు. మహిళల ఉచిత శిక్షణా తరగతులు ముగింపు సందర్భంగా ఆమె శుక్రవారం వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైలరింగ్, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, మగ్గం వర్క్ లాంటి వాటిలో ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సాయి ప్రసన్న, పద్మ, శ్యామల, జ్యోతి లహరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పదవీకాలం పొడిగింపు**

కొండపాక(గజ్వేల్): పీఏసీఎస్, డీసీసీబీ, టీజీసీబీల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు కొనసాగేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1964 సెక్షన్ 32(7)(ఏ)ప్రకారం పీఏసీఎస్ పాలక వర్గం పదవీకాలాన్ని మరో ఆరు మాసాలపాటు కొనసాగేలా జీఓ విడుదలైందన్నారు.

◆ **యూరియా ఎక్కువైతే నష్టం**

బెజ్జంకి(సిద్దిపేట): పంటలకు యూరియా ఎక్కువగా వినియోగిస్తే పురుగుల ఉధృతి పెరిగి పంట నాశనం చేస్తాయని ఏఓ సంతోష్ చెప్పారు. బెజ్జంకి సహకార సంఘం భవనంలో శుక్రవారం జరిగిన యూరియా పంపిణీని పరిశీలించారు. నానో యూరియా ప్లస్ వాడితే మంచిదని రైతులకు సూచించారు. అనంతరం నానో యూరియా అందజేశారు. సీఈఓ వాసు పాల్గొన్నారు.

◆ **మొక్కలను సంరక్షిద్దాం..**

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మూడు రకాల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ మంజుల పిలుపునిచ్చారు. మున్సిపల్ వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం 24వ వార్డులో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. గ్రీన్ సిద్దిపేటనే లక్ష్యంగా ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

◆ **రూ.50 వేల సామగ్రి అందజేత**

గజ్వేల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని రిమ్మనగూడ ప్రాథమిక పాఠశాల కోసం అదే గ్రామానికి చెందిన పిరమిడ్ సెక్యూరిటీ సంస్థ అధినేత, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కామేపల్లి వెంకట నర్సింహారావు రూ.50 వేలు విలువైన సామగ్రిని శుక్రవారం అందజేశారు. అలాగే పాఠశాలకు విద్యా వలీంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆయనకు హెచ్‌ఎం నాగభూషణం కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు భద్రమ్మ, సురేశ్ పాల్గొన్నారు.